క్లుప్తంగా

'ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం'



మాట్లాడుతున్న ఆనంద్

కెరమెరి: ఎండీఎం వర్కర్ల సమస్యలను పరిష్కరించకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల్ ఆనంద్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 11 రోజులుగా కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రంబాయి, సోంబాయి, కవిత, పగ్గుబాయి, లక్ష్మిబాయి, భీంబాయి, బిస్మిల్ల తదితరులు ఉన్నారు.

నేడు ప్రెస్‌క్లబ్ భవనం ప్రారంభం

దహెగాం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని సోమవారం సిర్పూర్(టి) నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించనున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రెస్‌క్లబ్ భవనంతో పాటు, అంబేద్కర్ లైబ్రరీని సైతం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రెబ్బెన: మండలంలోని నంబాల సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. బెల్లంపల్లి నుంచి వచ్చే విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నంబాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఓడి బియ్యం, పట్టు వస్త్రాలతోపాటు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన కార్యదర్శి దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిధులు మంజూరు చేయడం హర్షనీయం

జైనూర్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో గల సిద్ధేశ్వర సంస్థాన్ ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో ఆదివారం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలాజీ బాబా ఆలయాభివృద్ధికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ కమిటీ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే, సభ్యులు దుక్రే సుభాష్ తదితరులు ఉన్నారు.

విశ్వప్రసాదరావుకు పరామర్శ

ఆసిఫాబాద్: ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందిన డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావును ఆదివారం సాయంత్రం బీసీ సంఘం నేతలు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పరామర్శించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్, మారుతి పటేల్, పురుషోత్తం, గాజుల జక్కయ్య, శంకర్ పటేల్‌తో పాటు పలువురు బీసీ సంఘం నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

11న జిల్లా చెస్ అసోసియేషన్ సమావేశం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని కేకే గార్డెన్స్‌లో ఈ నెల 11న సాయంత్రం 4 గంటలకు జిల్లా చెస్ అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర చదరంగం ఉపాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు ఎన్నికలు సైతం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనేందుకు కుమురం భీం జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులని, పదేళ్లుగా జిల్లాలో నివాసం ఉన్నవారు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్నారు. పోటీదారుడి ఆధార్‌కార్డు జిల్లాలోనే ఉండాలని, చెస్ క్రీడాకారుడి తల్లిదండ్రులు సైతం పోటీకి అర్హులన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారు నామినేషన్ దాఖలు చేయాలని, పూర్తి వివరాలకు 8978146456 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శరవేగంగా శంకుస్థాపనలు

- ఎన్నికల వేళ జోరుగా అభివృద్ధి పనులు
- కోడ్‌కు ముందే పనులు ప్రారంభం



ఎర్రగుట్టరోడ్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప (ఫైల్)

పెంచికల్‌పేట్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ గడువు దగ్గర పడుతుండటంతో మండలంలోని పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు వేగంగా శంకుస్థాపనలు చేస్తున్నారు. గతంలో మంజూరైన పనులతో పాటు, పెండింగ్‌లో ఉన్న పనులకు కొబ్బరికాయలు కొడుతూ గ్రామాల్లో పనులు ప్రారంభిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మండలంలోని ఎల్లూర్, పెంచికల్‌పేట్, ఎర్రగుట్ట, కొండపల్లి గ్రామాల్లో బీటీరోడ్లు, వంతెనల నిర్మాణానికి భూమిపూజలు చేశారు.

మండలంలో ప్రారంభమైన పనులు..

- ఎల్లూర్ గ్రామపంచాయతీలోని కొత్తగూడ హనుమాన్ ఆలయం నుంచి కొమ్ముగూడ వరకు రూ.67 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గుత్తేదారు పనులను ప్రారంభించారు.
- ఎల్లూర్ ప్రధాన రహదారి నుంచి పెంచికల్‌పేట్ వరకు రూ.94లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.
- బొంబాయిగూడ గ్రామం నుంచి ఎర్రగుట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1కోటి, ఉచ్చమల్లవాగుపైన రోడ్ డ్యాం నిర్మాణానికి రూ. 2కోట్లతో పనులు ప్రారంభించారు.
- కొండపల్లి గ్రామంలోని గొల్లవాడ వద్ద వంతెన నిర్మాణానికి రూ.2కోట్ల 40లక్షలతో నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.

దగ్గరలో ఎన్నికల కోడ్..

మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి ప్రతీ పంచాయతీకి రూ.10 లక్షలతో మొత్తం 1కోటి 20లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణాల పనులకు భూమిపూజలు చేసి పనులను వేగంగా పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. ఎన్నికల కోడ్ కంటే ముందు పనులను పూర్తి చేయటానికి గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు.

పనులు పూర్తి చేయాలి



మారుమూల గ్రామాల్లో సీసీరోడ్లు, బీటీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌లు, వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షనీయం. గ్రామాల్లో ప్రారంభించిన పనులను శరవేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– సుగుణాకర్, బొంబాయిగూడ

బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

పెంచికల్‌పేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో గొల్లవాడ వద్ద రూ.2కోట్ల 40లక్షల నిధులతో వంతెన నిర్మాణ పనులను ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారులు, వాగులపై వంతెనలు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉపాసీ సంజీవ్, జాజిమొగ్గ శ్రీనివాస్, దుర్గం రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, మాజీ సర్పంచ్‌లు సుధాకర్, పరదేశి, సిద్ధు, రాకేశ్, పవన్, సాయికిరణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప



గుంతలమయమైన కల్వాడ రోడ్డు

గుంతల రోడ్లు

- కల్వాడ నుంచి కుంచవెల్లి రోడ్డు అధ్వానం
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

దహెగాం: మారుమూల గ్రామాలకు మెరుగైన రోడ్ల సౌకర్యం ఉన్నా అవి అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రోజురోజుకు గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా అటవీశాఖ అనుమతి లేదని అధికారులు అడ్డుకుంటున్నారు. మండలంలోని కల్వాడ నుంచి కుంచవెల్లి మీదుగా పీకలగుండం వరకు గత ఆరునెలల క్రితం బీటీ కోసం నిధులు మంజూరయ్యాయి. కుంచవెల్లి నుంచి పీకలగుండం వరకు రోడ్డు పూర్తిచేశారు. కల్వాడ నుంచి కుంచవెల్లి వరకు అటవీశాఖ అనుమతి లేక రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఉన్న రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీశాఖ అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. లగ్గాం నుంచి ఒడ్డుగూడ వెళ్లేమార్గంలో నాలుగేళ్ల క్రితం వేసిన బీటీ గుంతలమయంగా మారింది. వర్షాకాలం వరినాట్ల సమయంలో కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై నడవడంతో రహదారి చెడిపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా గిరవెల్లి నుంచి కర్జి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపునీరు నిలిచి ఉంటోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకుని చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా రహదారి

బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం స్థానిక మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీకి చెందిన ఫైసల్ బిన్ సులేమాన్, షబ్బీర్ అహ్మద్, అయూబ్ ఖాన్, తేజ్ బహదూర్ సింగ్, రఫీ ఖాన్, షఫీ అహ్మద్, మేకల శంకర్, ఇక్బాల్ హుస్సేన్ తదితరులు ఈ నెల 11న బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేపడుతున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నికూరే రూపేశ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌లో చేరికలు అవాస్తవం'



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కొంత మంది బీఎస్పీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్తున్నట్లు అధికార పార్టీ నాయకులు చేసిన ప్రకటనలో వాస్తవం లేదని బీఎస్పీ పార్టీ నాయకుడు షబ్బీర్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ భయం పట్టుకున్న అధికార పార్టీ నాయకులు కొంతమంది అనామకులతో పార్టీ మార్పు ప్రకటనలు చేయిస్తున్నారన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఎన్నడూ పాల్గొనని వారిని బీఎస్పీ నాయకులుగా పేర్కొంటున్నారని మండిపడ్డారు.

జ్యోతిబాపూలే వార్షికోత్సవాలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న నాగోసే శంకర్

కెరమెరి: జిల్లాలో మాలి కులస్తులు గ్రామాల్లో మహాత్మ జ్యోతిబా పూలే జెండా పండుగ వార్షికోత్సవాలను ఈ నెల 10 నుంచి 17 వరకు జరుపుకోవాలని మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసే శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17న జిల్లా కేంద్రంలో జెండా పండుగ నిర్వహిస్తామన్నారు. ఇటీవల మాలి కులస్తుల్లో పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు ఆసిఫాబాద్‌లోని బీసీ కమ్యూనిటీ భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారు 9866871661లో సంప్రదించాలన్నారు. నాయకులు గుర్నూలే మెంగాజి, కావ్‌డే తుల్సీరాం, సెండే నారాయణ, కావుడే దత్తు, సెండే సోమేశ్వర్, తిరుపతి, సోమా తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

చింతలమానెపల్లి: పోలీసులు పని చేసేది ప్రజల కోసమే అని ఎస్సై వెంకటేష్ అన్నారు. మండలంలోని కేతిని గ్రామంలో ఆదివారం పోలీసులు మీకోసంలో భాగంగా ఆయన పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.



దహెగాం మండలం బీబ్రా, ఐనం గ్రామాలను ఆదివారం ఉదయం మంచు దుప్పటి కమ్మేసింది. ప్రధానరోడ్లపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి. ఉదయాన్నే వాకింగ్, పొలాలకు వెళ్లేవారు పొగమంచు కారణంగా ఇబ్బందులు పడగా.. మరి కొందరు పొగమంచు అందాలను వీక్షించడం కనిపించింది. – దహెగాం

బతుకమ్మ చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం చీరలను కానుకగా అందజేస్తుందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని గుండి, చోర్‌పల్లి గ్రామాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ చీరలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యువతకు క్రీడాకిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, దత్తు, రవీందర్, గణపతి, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా వాసులకు ఉద్యోగాలు..?

తిర్యాణి: ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో పొరుగు ఉన్న ఓ మండలానికి సంబంధించిన అభ్యర్థులు జిల్లాలో చదివినట్లుగా మూతబడిన స్కూల్‌లో బోనఫైడ్ సర్టిఫికెట్లు తీసుకుని కుమురంభీం జిల్లా స్థానికతపై కొంతమంది ఉద్యోగం పొందిన ట్లుగా విశ్వసనీయవర్గాల సమాచారం. ఉద్యోగం పొందిన వ్యక్తుల్లో ఒకరు ఇప్పటికే ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారని, సదరు వ్యక్తికి తాజాగా కుమురం భీం జిల్లా స్థానికతపై ఉద్యోగం సాధించినట్లు సమాచారం. ఒక మార్కు, అర మార్కుతో ఉద్యోగం కోల్పోయిన అభ్యర్థులు ఈ విషయంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నట్లు సాక్షికి తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

నార్నూర్: ఆర్మీ జవాన్‌గా విధుల్లో చేరి తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ రాథోడ్ అనిల్‌కు నాగల్‌కొండ గ్రామస్తులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా ఇంటివరకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత నారాయణ్, ఉప సర్పంచ్ అజ్జు, శ్రీసంత్ సేవా సమితి అధ్యక్షుడు సందీప్ రాథోడ్, ఉపాధ్యక్షుడు సుభాష్, జితేందర్ పాల్గొన్నారు.

బౌద్ధ కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: సిర్పూర్ తాలుకాలో బౌద్ధ సమాజంలోని ప్రజల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించాలని బౌద్ధ సభ తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ సమాజ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 న ధమ్మ చక్ర పరివర్తన్ దివస్‌ను మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. వర్షవాస్ ముగింపు కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టాలని పేర్కొన్నా రు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి రత్నం శ్రీకాంత్, నేతకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య, మండల అధ్యక్షుడు బండురావు, సభ్యులు దిలీప్‌కుమార్, ఏమాజీ, ఆగయ్య, జీవన్‌దాస్, రాజారం, పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'తో పేదల కల సాకారం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేత



పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: గృహలక్ష్మితో పేదల సొంతింటి కల సాకారమవుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం కౌటాల రైతువేదిక భవనంలో 251 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు ఉత్తర్వుల పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గూడు లేని పేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3లక్షల సాయం అందిస్తుందన్నారు. అనంతరం కౌటాల -టేకంగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ. 3.5 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచులు మౌనిశ్, రమేశ్, శ్రీనివాస్, దామోదర్, రాందాస్, నిహారిక, శంకరమ్మ, ఎంపీటీసీలు శిరీష, మనీష్, పార్టీ మండలాధ్యక్షులు వసంత్‌రావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు శైలజాగౌడ్, మధుకర్, సదాశివ్, వెంకన్న, నక్క శంకర్, గట్టయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లోని హనుమాన్ ఆలయానికి ప్రహరీ నిర్మాణానికి ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు రాపర్తి శంకర్, సింగాడే అశోక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమావేశం హాల్‌కు భూమిపూజ..

పట్టణంలోని బజార్‌వాడీలో మహిళా సంఘాల సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా సమావేశం హాల్ నిర్మాణానికి ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లిఖార్జున్, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన యువకులకు సన్మానం



సన్మానిస్తున్న సీసీఆర్ సభ్యుడు వసీం

రెబ్బెన: పేదింట్లో పుట్టి ఎంతో కష్టపడి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆదివారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్, గోలేటి యూత్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో చదువుకుంటూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పోలీస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ ద్వారా ఉద్యోగాలు సాధించిన వినోద్, కల్పన, సుప్రిల్, శ్రీకాంత్‌లను గ్రంథాలయంలో శాలువాలతో సన్మానించి అభినందించారు. సీసీఆర్ సభ్యులు అబ్దుల్ వసీం, గ్రంథాలయ ఇన్‌చార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వప్రసాద రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడికి చెందిన పలువురు యువకులు ఆదివారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నియోజకవర్గ నాయకులు మర్సుకోల సరస్వతి, శ్యాం నాయక్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ అలీ వసంత్, చరణ్, దీపక్, తమీమ్ అలీ, షేక్ మహ్మద్ పాషా, హరీశ్, అసద్ పాల్గొన్నారు.